కక్షసాధింపుతోనే కాంగ్రెస్ అగ్రనేతలపై కేసులు

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- నేషనల్ హెరాల్డ్ కేసు చార్జీషీటులో సోనియా, రాహుల్ పేర్లపై నిరసన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : 'అక్రమ కేసులతో గాంధీల కుటుంబాన్ని లొంగదీసుకోవాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్‌గాంధీల పేర్లు నేషనల్ హెరాల్డ్ కేసు చార్జీషీట్‌లో చేర్చారు' అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ నేత హనుమంతరావు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జీ షీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు చేర్చ డాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. 'సత్యమేవ జయతే' నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ పత్రికకు డబ్బులు ఇస్తే అది మనీలాండరింగ్ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. అక్రమ కేసులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాకు భారీగా తరలిరావాలి..

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వైఖరిని నిరసిస్తూ గురువారం ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయం ఎదుట ధర్నాకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్నాకు పార్టీ నాయకులు, శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

రాష్ట్ర కాంగ్రెస్‌లో ఢిల్లీ నాయకుడి హడావుడి

- కీలకపాత్ర కోసం వంశీచంద్‌రెడ్డి ప్రయత్నాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి ఇటీవలి కాలంలో ఢిల్లీని వదిలి రాష్ట్రంలో ఎక్కువ సమయం గడపడం గాంధీభవన్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ పదవిలో ఉన్న వంశీచంద్ గత కొన్ని రోజులుగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నారు. నిరుడు లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి పోటీచేసి ఓడిపోయిన వంశీచంద్ రాష్ట్రంలో పార్టీ పదవిపై కన్నేసినట్టు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సభ్యునిగా ఉన్న ఆయన హైకమాండ్‌కు సన్నిహితంగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఏఐసీసీ ఆఫీస్‌లో కేసీ వేణుగోపాల్ తర్వాత పార్టీ వ్యవహారాలను కూడా చక్కబెడుతున్నట్టు సమాచారం. అయితే ఆయన ఆకస్మికంగా హస్తినను వదిలిరావడంపతో రాష్ట్రంలో ముఖ్యపాత్ర పోషించాలని ఉవ్విళ్లూరుతున్నారని చెప్పుకుంటున్నారు. ఈ మధ్య కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రానికి వచ్చినప్పటి నుంచి వంశీచంద్ హడావుడి మొదలైనట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మీనాక్షి తోపాటు పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలలో ఆయన కూడా పాల్గొంటున్నారు. ఇక కొత్త కార్యవర్గంలో స్థానం ఆశిస్తున్న వారికి ఫోన్లుచేసి, వారి బయోడాటాను సేకరించి ఇన్‌చార్జికి ఇస్తున్నట్టు సమాచారం. దీన్ని ఆసరాగా చేసుకొని నేతలను తనవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర కార్యవర్గంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం ఆయన ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అయితే, వంశీచంద్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లోకి రావడాన్ని ముఖ్యమంత్రి వర్గం జీర్ణించుకోవడంలేదని తెలిసింది. ఆయనకు ఇక్కడేం పని అంటూ సీఎం వర్గీయులు విసుక్కుంటున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ప్రత్యూష (ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 16: ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగం రావడం లేదని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని పవర్‌హౌజ్ కాలనీలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవర్‌హౌజ్ కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) ఎంకామ్ వరకు చదువుకున్నది. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసింది. ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా చూడడంతో బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రత్యూష తండ్రి విఠల్ కోర్టు వద్ద టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ భూమేశ్ పేర్కొన్నారు.

'నిమ్జ్' నుంచి 3 తండాలకు మినహాయింపు?

- లగచర్ల ఎఫెక్టే ప్రధాన కారణం
- 3,600 ఎకరాల్లోనే పరిశ్రమలు!
- భూసేకరణకు రైతుల ససేమిరా

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటన అనంతరం భూసేకరణ విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. జహీరాబాద్ నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్) కోసం ప్రతిపాదిత భూసేకరణలో మూడు గిరిజన తండాలతోపాటు పలు పాఠశాలలకు సర్కారు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు త్వరలో నోటిఫికేషన్ జారీకానున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

కోర్టును ఆశ్రయిస్తున్న రైతులు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల పరిధిలోని 17 గ్రామాల్లో సుమారు 12,600 ఎకరాల్లో నిమ్జ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 2016లో ప్రాజెక్టు మంజూరు కాగా, కేసీఆర్ సర్కారు హయాంలోనే సగానికంటే ఎక్కువ భూసేకరణ పూర్తయింది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులూ వచ్చాయి. సేకరించిన భూముల్లో సుమారు 3,600 ఎకరాలను పరిశ్రమల కోసం అభివృద్ధి చేసేందుకు టీజీఐఐసీ చర్యలు చేపడుతున్నది. ఈ నేపథ్యంలో మిగిలిన భూసేకరణ నుంచి ముంగితండ, చీలపల్లి, రుక్మాపూర్ తండాలతోపాటు అక్కడి పాఠశాలలను మినహాయించారు. ఈ మూడు గ్రామాల్లో 150 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మరోవైపు మామిడ్గి, హుసెల్లి, గణేశ్‌పూర్ తదితర గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకించడంతో కొద్దిరోజులు భూసేకరణ ప్రక్రియను నిలిపివేసిన అధికారులు.. తాజాగా హుసెల్లిలో 653.08 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు. 491 మంది రైతుల నుంచి ఈ భూములను సేకరించాలని నిర్ణయించారు. వీటిలో కొంత మేరకు పట్టా భూములు కాగా, మిగిలివని అసైన్డ్ భూములు కావడం గమనార్హం. మరోవైపు భూసేకరణకు గతంలో అంగీకరించిన అన్నదాతలు సైతం ఇప్పుడు పెరిగిన ధరల కారణంగా తమ భూములు ఇచ్చేందుకు ఒప్పుకోవడం లేదు. కొందరు ఇప్పటికే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయించే అవకాశం లేకుండాపోయిందని.. 3,600 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉండటంతో ప్రస్తుతానికి అక్కడ ప్లాట్లను అభివృద్ధి చేసి కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎకరానికి రూ.4 లక్షల చొప్పున చెల్లించి భూసేకరణ చేశారని, ఇప్పుడు జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు రూ.కోటికి తక్కువ లేవని రైతులు చెబుతున్నారు. కాగా, ప్రభుత్వం రూ.15 లక్షలు మాత్రమే ఇస్తున్నదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూములు ఇచ్చేదే లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. న్యాల్‌కల్ మండలం సహా పరిసర ప్రాంతాల్లో ఓ వైపు ఫార్మాసిటీ, మరోవైపు నిమ్జ్ పేరుతో భూములన్నీ సేకరిస్తున్నారని, దీంతో తమకు వ్యవసాయం చేసుకునేందుకు ఒక్క గుంట కూడా మిగలడం లేదని వాపోతున్నారు.

లగచర్ల తిరుగుబాటు వల్లే వెనుకడుగు...

వికారాబాద్ జిల్లా లగచర్లలో గిరిజన రైతుల తిరుగుబాటు వల్లే ప్రభుత్వం తాజా భూసేకరణపై వెనుకడుగు వేసినట్టు తెలుస్తున్నది. లగచర్ల పరిధిలో ఫార్మాసిటీ పేరుతో భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నది. పోలీసుల పహారాలో భూసేకరణ చేపట్టడంతో రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చి మరో నోటిఫికేషన్ జారీచేసినా రైతులు వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలో నిమ్జ్ ప్రతిపాదిత భూసేకరణ నుంచి గిరిజన తండాలను మినహాయించినట్టు పలువురు పేర్కొంటున్నారు.

జపాన్‌కు చేరుకున్న సీఎం రేవంత్ బృందం

- 22 వరకు పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి 8 రోజుల పర్యటనలో భాగంగా జపాన్‌కు చేరుకున్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయల్దేరిన ఆయన బృందం.. బుధవారం మధ్యాహ్నం నారిటా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నది. పర్యటనలో భాగంగా 22వరకు జపాన్‌లోని టోక్యో, మౌంట్‌ఫుజి, ఒసాకా, హిరోషిమాలో సీఎం బృందం పర్యటించనున్నది. ఒసాకాలో ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలో సీఎం పాల్గొననున్నారు. జపాన్‌లో కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత అభివృద్ధిపై బృందం అధ్యయనం చేయనున్నది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతోపాటు, అక్కడి వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలను ఆహ్వానించనున్నట్టు సమాచారం. జపాన్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందానికి బుధవారం అక్కడి భారత రాయబారి శిబు జార్జ్ స్వాగతం పలికారు. టోక్యోలోని ఇండియా హౌస్‌లో రాత్రి బస ఏర్పాటు చేశారు. విందులో సీఎం రేవంత్‌తోపాటు ఎంపీలు కనిమొళి కరుణానిధి, రఘువీర్ రెడ్డి, నెపోలియన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు 1.13 లక్షల ఇండ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): పీఎంఏవై-యు కింద పట్టణ పేదలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,13,681 ఇండ్లు మంజూరు చేసింది. ఇందుకు రూ.1,705.21 కోట్లు మంజూరు చేసింది. మంజూరైన నిధుల్లో మొదటి విడతగా రూ. 682.08 కోట్లు విడుదలకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. కేంద్రం నిధుల నుంచి ఒక్కో లబ్ధిదారుకు రూ.1.5 లక్షలు సాయం అందనుంది. మిగిలిన రూ.3.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈ మొత్తం రూ.3,978.83 కోట్లు అవుతుంది. ఇప్పటికే కేంద్రం సాయంతో నిర్మించిన ఇండ్లలో 58,000 ఇండ్ల ఆక్యుపెన్సీ వివరాలు తమకు సమర్పించలేదని, ఆ ఇండ్ల వివరాలు అందించాలని కేంద్రం లేఖలో కోరింది.

మంత్రుల మధ్య గాలిమోటర్ రచ్చ

- కొందరే ఎక్కువగా వాడుతున్నారని ఇతరుల అసంతృప్తి
- సమీప ప్రాంతాలకు కూడా హెలికాప్టర్ రైడ్‌పై విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గంలో హెలికాప్టర్ చిచ్చు రేగినట్టు తెలుస్తున్నది. కొంతమందికి మాత్రమే హెలికాప్టర్ వాడుకొనే అవకాశం లభించడంపై మిగిలిన వారు.. తాము మంత్రులం కాదా? హెలికాప్టర్ వాడే హక్కు తమకు లేదా అంటూ మనోవేదన చెందుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విషయం గతంలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో కొందరు మంత్రులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇటీవల జరిగిన సీఎల్పీ సమావేశంలో కూడా హెలికాప్టర్ వ్యవహారంపై ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గుసగుసలు వినిపించినట్టు సమాచారం. హైదరాబాద్‌కు దూరంగా ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు మంత్రులు హెలికాప్టర్‌ను ఉపయోగించడం సాధారణం. అయితే కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభించడం, మిగిలినవారికి హెలికాప్టర్ అందుబాటులో ఉండకపోవడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి ప్రభుత్వ హెలికాప్టర్‌ను ఉపయోగిస్తూ జిల్లాల పర్యటనలు చేస్తారు. సీఎం పర్యటన ఎక్కడా లేనప్పుడు, హెలికాప్టర్ ఖాళీగా ఉంటే మాత్రమే మంత్రులు దానిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా నిబంధనలేమీ లేవని అధికారులు పేర్కొంటున్నారు.

నలుగురైదుగురు మంత్రులే రెగ్యులర్‌గా ..!

కొన్ని కీలక శాఖలు నిర్వర్తిస్తున్న నలుగురైదుగురు మంత్రులు మాత్రమే రెగ్యులర్‌గా హెలికాప్టర్‌ను ఉపయోగిస్తున్నారు. ఓ మంత్రి రంగారెడ్డి జిల్లా పర్యటనకు కూడా హెలికాప్టర్‌ను వాడుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఎక్కువగా హెలికాప్టర్ వాడుతున్నారని, వారిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందున్నారని అటువంటి అవకాశం తమకు దక్కడం లేదని ఓ సీనియర్ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. నల్లగొండ మంత్రులకు మాత్రమే హెలికాప్టర్ భాగ్యం ఉందని తాజాగా మంత్రి దామోదర రాజనర్సింహ సైతం వ్యాఖ్యానించారు. కొంతమంది మంత్రులు ప్రైవేట్ కార్యక్రమాలకు, విందులకు సైతం హెలికాప్టర్‌ను వాడుతున్నారనే విమర్శ రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నది. దీనిపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్టు తెలిసింది. మంత్రులు హెలికాప్టర్‌ను పల్లె వెలుగు బస్సులా మార్చారంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఈ గాలిమోటర్ రచ్చకు సీఎం రేవంత్‌రెడ్డి పుల్‌స్టాప్ పెడతారా లేక అధిష్ఠానం ఈ విషయంలో జోక్యం చేసుకుంటుందా అని పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయరంగంలో ఏఐ సేవలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): వ్యవసాయరంగంలో ఏఐ సాంకేతికతను వినియోగించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో ఆ శాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, పలు సాంకేతిక కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చీడపీడలపై రైతులను అలర్ట్ చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటనష్టాన్ని వెంటనే అంచనా వేయాలని ఆదేశించారు.

యువవికాసానికి బ్యాంకర్లు సహకరించాలి

- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా యువతకు తోడ్పాటు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో యువ వికాసం పథకం అమలుపై బ్యాంకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6,000 కోట్లు ఖర్చు పెడుతుందని, బ్యాంకర్లు రూ.1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ పథకం అమలయ్యేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి

- లెనిన్‌బాబు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): దేశంలోని వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నులు, బడా వ్యాపారస్తుల ఆస్తులను జాతీయం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంపన్నులు దేశాన్ని అన్ని రకాలుగా దోచుకుని ఆర్థికంగా లాభపడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి కార్పొరేట్ సంస్థలపై ఉన్న శ్రద్ధ.. నిరుద్యోగ యువతపై లేదని విమర్శించారు. 2023లో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్, పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి ఎస్టీ వర్గీకరణ ఉద్యమం

మొదటిపేజీ తరువాయి...

వర్గీకరణ చేసుకోవచ్చని 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమ సంఘాల నేతలు రాష్ట్ర సర్కారుపై ఒత్తిడి పెంచారు. దీంతో ప్రభుత్వానికి వర్గీకరణ చేయాల్సిన అనివార్యత ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో బిల్లు ఆమోదించింది. ఇప్పుడు ఎస్టీలను వర్గీకరించేందుకు కూడా వెంటనే కమిషన్‌ను నియమించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

1996 నుంచి ఉద్యమం.. లంబాడీ, ఆదివాసీ వివాదం

ఎస్టీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలనే డిమాండ్‌తో 1996లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ సంఘాలు ఉద్యమం చేపట్టాయి. 2017లో వర్గీకరణ ఉద్యమాన్ని కొందరు నేతలు రాజకీయ స్వప్రయోజనాల కోసం పక్కదారి పట్టించారని విమర్శలు ఉన్నాయి. ఎస్టీల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే డిమాండ్‌తో కొందరు ఉద్యమాన్ని చేపట్టారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ తరహా ఉద్యమాలు ఎక్కువగా జరిగాయి. ఉద్యమాన్ని పక్కదారి పట్టించిన నేతలు రాజకీయలబ్ధి పొందారని, తమకు న్యాయం జరగలేదని ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ప్రజాసంఘాల సమావేశాలు, మేధావుల అంతర్మథనంతో ఉద్యమరూపుపై స్పష్టత వచ్చిందని ఆదివాసీ నేతలు చెప్తున్నారు. లంబాడీలను ఎస్టీల జాబితా నుంచి తొలగించాలని కాకుండా ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ నినాదంతో ఉద్యమించనున్నట్టు స్పష్టంచేస్తున్నారు.

వర్గీకరణ ఎలా ఉండాలి? ఆదివాసీల డిమాండ్ ఏంటి?

ఎస్టీలను నాలుగు రకాలుగా వర్గీకరించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలోని ఎస్టీ జాబితాలో 33 తెగలు ఉన్నాయి. ఇందులో యానాది, ఎరుకల, లంబాడీ అనే మూడు వర్గాలను 1976లో జాబితాలో చేర్చారు. అప్పటివరకు ఎస్టీలకు 4శాతంగా ఉన్న రిజర్వేషన్లను 6 శాతానికి పెంచారు. కానీ 1976లో ఎస్టీల్లో చేర్చిన వర్గాలు అటవీప్రాంతంతో పాటు మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వారు ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్నవారు కావడంతో విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎక్కువ లబ్ధి పొందుతున్నారని ఆదివాసీలు చెప్తున్నారు. అటవీప్రాంతాల్లో జీవించే ఆదివాసీలకు సముచితన్యాయం చేకూర్చేందుకు ఎస్టీలను వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. 1976లో ఎస్టీల్లో చేర్చిన వర్గాలను ఒకటిగా వర్గీకరించి, మిగిలిన ఆదివాసీ తెగలను మూడు రకాలుగా వర్గీకరించాలని కోరుతున్నారు. పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్(పీవీటీజీ) పరిధిలోని కొలాం, తోటి, మన్నెవార్ తదితర తెగలను ప్రత్యేక గ్రూపుగా, మిగిలిన ఆదివాసీలను ఒక గ్రూపుగా, ఆదివాసీల్లోని సంచార తెగలను మరో వర్గంగా మొత్తం నాలుగు రకాలుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కమిషన్‌ను నియమిస్తే ఈ ప్రతిపాదనలను అందజేస్తామని ఆదివాసీ నేతలు చెప్తున్నారు.

మొదలైన ఉద్యమ కార్యాచరణ

ఎస్టీ వర్గీకరణ డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు కార్యాచరణను మొదలుపెట్టారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారంలో 500 మంది ఆదివాసీ మహిళలతో సదస్సు నిర్వహించారు. పాల్వంచ, గూడూర్‌లోనూ చైతన్య సమావేశాలు ఏర్పాటు చేశారు. గురువారం కూడా పాకాల కొత్తగూడ మోకాలపెల్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 17న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో భారీ బహిరంగసభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సభలో వర్గీకరణ లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తామని ఆదివాసీ నేతలు చెప్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కాంగ్రెస్ సర్కారు వర్గీకరణ చేసి తీరాల్సిందేననే డిమాండ్‌తో పోరాటం ఉంటుందని స్పష్టంచేస్తున్నారు.

కేసీఆర్ పెంచారు.. కాంగ్రెస్ ఏం చేస్తుంది?

2014లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్ర జనాభాలో ఎస్టీలు 36,44,453 అంటే 10 శాతంగా ఉన్నారు. నివేదిక ఆధారంగా నాటి సీఎం కేసీఆర్ ఎస్టీల రిజర్వేషన్ పెంచాలని నిర్ణయించారు. 40ఏండ్ల పాటు 6శాతంగా ఉన్న ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించారు. అయితే తాజాగా కాంగ్రెస్ సర్కారు చేసిన సర్వేలో రాష్ట్ర జనాభాలో ఎస్టీలు 37,05,929 అంటే 10.45 శాతం ఉన్నట్టు తేలింది. ఈ లెక్కలపై భిన్నవాదనలు ఉన్నప్పటికీ, మరోసారి ఎస్టీల జనాభాను లెక్కించి జనాభా ప్రతిపాదికన, ఆదివాసీ తెగల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి స్థితిగతులపై అధ్యయనం చేసి, ఎస్టీలను ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేయాలని డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి.

ఎస్టీలను వర్గీకరించాల్సిందే..

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం వాటా ఇస్తున్నది. ఎస్సీ వర్గీకరణతో ఆ వర్గాలకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నది. ఎస్టీల్లోనూ అసమానతలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో చాలా మంది ఆదివాసీలకు ప్రాధాన్యం లేదు. ఎస్టీ రిజర్వేషన్ అనేది కొన్ని తెగలకే పరిమితమైంది. ఆర్థికంగా, సామాజికంగా ఆ తెగలే బాగున్నాయి. ఆదివాసీల్లో 33 తెగలుంటే మూడు, నాలుగు తెగలకే రాజ్యాధికారం పరిమితమైంది. 75 ఏండ్లు గడిచినా ఆదివాసీలు ఇంకా వెనుకబడే ఉన్నారు. ఎస్టీ వర్గీకరణ చేస్తేనే వారి జీవితాలు వెలుగులోకి వస్తాయి. ఎస్సీల మాదిరిగానే ఎస్టీ వర్గీకరణ చేసేందుకు వెంటనే కమిషన్ ఏర్పాటు చేయాలి. తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందులో నిర్వహించే బహిరంగ స